క్లుప్తంగా

నేడు రాఘవేంద్రుడి జయంతి

తాడిపత్రి టౌన్: స్థానిక గాజుల కృష్ణప్ప వీధిలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో ఆదివారం రాఘవేంద్రస్వామి జయంతి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం అభిషేకం, రథోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రక్తదాతకు సన్మానం


షోయబ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని రెడ్‌ఫ్లస్ సొసైటీ సంస్థ కార్యాలయంలో శనివారం 55 సార్లు రక్తదానం చేసిన కర్నూల్ సీడి సొసైటీ ప్రెసిడెంట్ షోయబ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రెడ్ ఫ్లస్ సంస్థ ప్రెసిడెంట్ షేక్షావలి, కార్యదర్శి మాఫీర్, సభ్యులు మున్నా, ఖాజా, వలి, గగారిన్, మనోహర్, వెంకటేష్, సాయి, రంగస్వామి, గంగరాజు తదితరులు రక్తదాత షోయబ్‌ను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా రెడ్ ఫ్లస్ సంస్థ అధ్యక్షుడు షేక్షావలి మాట్లాడుతూ షోయబ్ రక్తదానం వల్ల ఎంత మంది ప్రాణాలతో బయట పడ్డారో వివరించారు.

ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పుట్లూరు: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ యోగానందరెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన మడుగుపల్లిలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. పనుల వద్ద మస్టర్లను పరిశీలించి కూలీల సంఖ్యపై ఆరా తీశారు. అనంతరం అంగన్‌వాడీ, గ్రామ సచివాలయాల్లో రికార్డులను పరిశీలించారు.

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

తాడిపత్రి టౌన్ : హౌసింగ్ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా ఎమినిటీ సెక్రటరీలను హెచ్చరించారు. సజ్జలదిన్నె 1,2 జగనన్న లేఔట్లల్లో 3,200 పక్కా గృహాల నిర్మాణాలు జరుగుతున్నాయి. శనివారం సజ్జలదిన్నె లేఔట్లల్లో హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. అయితే వార్డు సచివాలయాల్లోని 25 మంది ఎమినిటీస్ సెక్రటరీలు గైర్హాజరయ్యారు. తీవ్రంగా పరిగణించిన కమిషనర్ వారందరికీ షోకాజ్‌నోటీసులు జారీ చేశారు.

కానిస్టేబుళ్ల దేహదారుఢ్య పరీక్షలు వాయిదా వేయాలి

తాడిపత్రి టౌన్ : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కానిస్టేబుళ్ల దేహదారుఢ్య పరీక్షలను వాయిదా వేయాలని బీజేపీ జిల్లా గ్రంథాలయ కన్వీనర్ పోతుల గంగాధర్ ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల రోజున పోలీసు కానిస్టేబుల్స్ పరీక్షకు సంబంధించి దేహధారుడ్య పరీక్షలు నిర్వహించొద్దని పేర్కొన్నారు.

ఘర్షణకు పాల్పడితే చర్యలు

శింగనమల: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం సలకంచెర్వు, రాచేపల్లి, నిదనవాడలో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ప్రశాంతంగా ఉండాలన్నారు. ఎన్నికల అధికారుల ఆదేశాల ప్రకారం పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తారని, అక్కడికి వచ్చి తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవచ్చునన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ


నారాయణమ్మ మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

పామిడి: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల నేత ఎల్ సూర్య నారాయణరెడ్డి తల్లి ఎల్ నారాయణమ్మ(88) వృద్ధాప్య సమస్యలతో శనివారం మృతి చెందారు. సమాచారం అందుకున్న గుంతకల్లు ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి బాధిత వైఎస్సార్‌సీపీ నేత సూర్యనారాయణరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

యల్లనూరు: నిట్టూరు, గిర్రమ్మబావి గ్రామాల సమీపంలో పొలాల్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. వారి నుంచి రూ.5,895 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

విజయమే లక్ష్యంగా పని చేద్దాం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి, పైలా



స్టిక్కర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి, పైలా, మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి

తాడిపత్రి: వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేద్దామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లకు పిలుపునిచ్చారు. శనివారం ఏఎన్నార్ గార్డెన్స్‌లో నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు శనిలా దాపురించారని పైలా నరసింహయ్య ధ్వజమెత్తారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థతో లక్షల మందికి ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. తాను అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థ రద్దు చేస్తానని చంద్రబాబు ప్రకటించడం దారుణమన్నారు. ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్నతోనే సంక్షేమ పాలన సాధ్యమన్నారు. జగనన్న పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరిందన్నారు.

ఫ్యాక్షన్ రూపుమాపడమే లక్ష్యం

నియోజకవర్గంలో ఫ్యాక్షన్‌ను రూపుమాపడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రకటించారు. జేసీ సోదరులు 30 ఏళ్లు నియోజకవర్గంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని కోట్లు ఆర్జించారని విమర్శించారు. రాజకీయ ఎదుగుదల కోసం ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించారని, ఇందులో ఎందరో అమాయకులు బలి అయ్యారన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. తాగు, సాగునీటి సమస్య పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ నెల 28 నుండి పెద్దవప్పూరు మండలంలో ప్రజానంక్షేమ పాదయాత్ర ప్రారంభిస్తున్నామన్నారు. గృహసారథులు, కన్వీనర్లు మా నమ్మకం నువ్వే జగనన్న అనే కార్యక్రమం ద్వారా ప్రజల్లో ముఖ్యమంత్రిపై ఉన్న నమ్మకాన్ని పెంచాలన్నారు. మరోమారు ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలుపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్లు, స్టిక్కర్లను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి, యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, ఎస్సీఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు, జెడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ, మార్కెట్ యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్లు హరినాథరెడ్డి, ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా మహిళా కార్యదర్శి షరీఫా పాల్గొన్నారు.

గెలుపే గృహసారథుల ధ్యేయం

- ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి

పామిడి: రాబోయే ఎన్నికల సంగ్రామంలో వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పనిచేయాలని ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక రహమత్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకే సంక్షేమ పథకాలను తెచ్చిన సీఎం జగన్ పాలన స్వర్ణయుగాన్ని తలపిస్తోందన్నారు. కులం, మతం, పార్టీ అన్న భేదం లేకుండా అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాల అందించి సీఎం జగన్ జన హృదయనేత అయ్యారన్నారు. ఏమాత్రం రాజకీయ పరిజ్ఞానం, పరిణితి లేని నారా లోకేష్ యువగళం పేర చేపడుతున్న పాదయాత్రకు జనం లేక అభాసుపాలవతోందన్నారు. జనాదరణ గల సీఎం జగన్‌ను ఓడించడానికి బాబు అండ్‌కో, ఆయన దత్తపుత్రుడు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అఖిలపక్షాలను సంఘటితం చేయడానికి చేస్తున్న కుటిలయత్నాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరిస్తూ ఓటుబ్యాంకు పెంచాలన్నారు. తద్వారా వచ్చే ఎన్నికల్లో 175కి 175 సీట్లతో విజయ ఢంకా మోగించి జనరంజక నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేయడానికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలన్నారు. పార్టీ విజయానికి పాటుపడిన ప్రతి ఒక్కరి శ్రమకు తగ్గ ఫలితం తప్పక ఉంటుందన్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో ఎమ్మెల్సీగా వెన్నపూస రవీంద్రరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకుముందు ఎమ్మెల్యేను పామిడి మండల టౌన్, రూరల్ కన్వీనర్లు బీ ఆసిఫ్, కుమార్‌రెడ్డి భారీ గజమాల వేసి శాలువాతో సత్కరించారు. పార్టీ పట్టణ కన్వీనర్ బొల్లు వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మండల రూరల్ కన్వీనర్ కే నారాయణరెడ్డి, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్లు పెమ్మక చెన్నకేశవరెడ్డి, గౌరవ్వ, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, చుక్కలూరు రామకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ బీ రుక్మాన్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దత్తు, ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డి సోదరుడు రమాకాంత్ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వర్‌రెడ్డి, బొట్టు రామచంద్ర, నక్కా ఓబులేసు, చుక్కలూరు రామచంద్రారెడ్డి, తొత్తిరెడ్డి గారి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటుడి సన్నిధిలో రైల్వే చీఫ్ మెడికల్ డైరెక్టర్


సిబ్బందితో రైల్వే పీసీఎండీ డోరా రామారావు

గుంతకల్లు రూరల్: సికింద్రాబాద్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డోరా రామారావు శనివారం కుటుంబ సమేతంగా కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. వేకువజామునే ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు వారికి స్వామి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం రైల్వే పీసీఎండీ డోరా రామారావు ఆలయ అన్నదాన కేంద్రానికి రూ.5,116 విరాళాన్ని అందజేశారు. గుంతకల్లు రైల్వే చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి గజలక్ష్మి ,రైల్వే హెల్త్ ఆఫీసర్ శ్యామ్ సుందర్ తదితరులు వారి వెంటున్నారు.

స్థలం ఉన్న వారికి ఇళ్లు మంజూరు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో సొంత స్థలం ఉన్న వారికి ఇళ్లు మంజూరు చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శరత్‌చంద్ర తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. సొంత స్థలం ఉన్న వారు సరైన డాక్యుమెంట్లు సచివాలయాల్లో అందజేస్తే పక్కా ఇంటికి బిల్లు చెల్లిస్తామని పేర్కొన్నారు. సోమవారం నుంచి సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అన్నదాతలూ.. త్వరపడండి


ఈక్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది


ఈ-కేవైసీ చేస్తున్న దృశ్యం

- ఈ-కేవైసీ నమోదుకు 28 తుది గడువు
- గడువు దాటితే బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, గిట్టుబాటు ధర కోల్పోయే ప్రమాదం

ఈ-కేవైసీ నమోదు వివరాలు..

మండలం	పంటసాగు (ఎకరాల్లో)	రైతులు	ఈకేవైసీ చేసుకున్నవారు	చేసుకోని వారు
గుంతకల్లు నియోజకవర్గం				
గుంతకల్లు	4,561	1,482	1,452	30
గుత్తి	3,310	1,130	1,106	24
పామిడి	3,076	1,087	1,026	61
తాడిపత్రి నియోజకవర్గం				
తాడిపత్రి	13,376	3,457	3,276	181
యాడికి	8,285	2,250	2,198	52
పెద్దపప్పూరు	10,693	3,215	3,059	156
పెద్దవడుగూరు	3,574	1,351	1,226	125
శింగనమల నియోజకవర్గం				
శింగనమల	5,159	2,393	1,912	481
పుట్లూరు	19,057	4,921	4,576	345
యల్లనూరు	10,537	2,992	2,647	345
బీకేఎస్	6,308	2,154	1,973	181
నార్పల	4,453	1,564	1,531	33
గార్లదిన్నె	3,682	1,403	1,285	118

గుంతకల్లు రూరల్: ఈ ఏడాది రబీలో పంటలకు సంబంధించి ఈ-కేవైసీ నమోదుకు ప్రభుత్వం ఈనెల 28 తేదీ తుది గడువు విధించింది. ఈ నేపథ్యంలో ఈక్రాప్ చేసుకున్న రైతులు ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈక్రాప్ బుకింగ్ చేసుకున్నప్పటికీ ఈ-కేవైసీ నమోదు చేయించుకోని పక్షంలో ప్రభుత్వం అందించే పంట నష్ట పరిహారంతోపాటు, పంటల బీమా, పంటకు ప్రభుత్వం అందించే గిట్టుబాటు ధర కూడా అందకుండా పోయే ప్రమాదం ఉంది.

90 శాతం నమోదు..

గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో ఇప్పటివరకూ 90 శాతం మంది రైతులు ఇప్పటికే ఈ- కేవైసీ నమోదు చేసుకునినారు. కేవలం 10 శాతం మంది రైతులు నమోదు చేసుకోలేదు. మృతి చెందిన రైతులు, వేలి ముద్రలు నమోదు కాని రైతుల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం వారి కుటుంబ సభ్యుల్లోని ఒకరి ఆధార్ కార్డు ఆధారంగా ఈ-కేవైసీ నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. ఈకేవైసీ నమోదుకు గడువు దగ్గర పడుతున్న నేపథ్యంలో రైతుల కోసం సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆర్బీకేల్లోనే అందుబాటులో ఉంటున్నారు. ఆధార్‌తో మొబైల్ నంబర్ లింక్ అయిన రైతులు తాము ఎక్కడ ఉన్నా ఓటీపీ ద్వారా ఈకేవైసీ నమోదు చేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు, సిబ్బంది కోరుతున్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

యాడికి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ గురు ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కేజీబీవీలో ఎస్‌ఓ నిర్మల ఆధ్వర్యంలో విద్యార్థినులకు బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బాలికలు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు, అసాంఘిక కార్యకలాపాలు, సైబర్ నేరాలు, జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు తెలపాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఉపాధ్యాయులు ఉన్నారు.

గుంతకల్లు రూరల్: ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమకు సమాచారం అందించాలని వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య విద్యార్థినులకు సూచించారు. శనివారం స్థానిక ఎస్‌జేపీ స్కూల్లో చైల్డ్ పోర్నోగ్రఫీ, చైల్డ్ సెక్సువల్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా వన్‌టౌన్ సీఐ, ఎస్‌ఐ మురహరి బాబు మాట్లాడుతూ ఎవరైనా చిన్నారులపై అత్యాచారాలను ప్రోత్సహించేలా సోషల్‌మీడియాలో వీడియోలు, ఫొటోలు పెడితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఎన్‌సీఆర్‌బీ సైబర్ క్రైమ్ పోర్టల్‌కు ఏ విధంగా ఫిర్యాదు చేయాలి, వాటిపై ఎలాంటి చర్యలు ఉంటాయన్న విషయాలపై అవగాహన కల్పించారు.

అకడమిక్ ఫేర్స్‌తో విజ్ఞానం


నమూనాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ శంకర్ ప్రసాద్, చైర్‌పర్సన్ వన్నూర్‌బీ

గుత్తి: అకడమిక్ ఫేర్స్‌తో విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని డిప్యూటీ డీఈఓ శంకర్ ప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ పేర్కొన్నారు. పట్టణ శివారులోని ఎస్కేడీ ఇంజినీరింగ్ భవనంలో ఉన్న మాసినేని ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం అకడమిక్ ఫేర్(ఎగ్జిబిషన్)ను వారు ప్రారంభించారు. అనంతరం డిప్యూటీ డీఈఓ, మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు పెద్దవడుగూరు ఎంఈఓ రాముడు, డైరెక్టర్ అమరేంద్ర, సీఈఓ శ్వేత, ప్రిన్సిపాల్ శామ్యూల్ ,గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ తదితరులు విద్యార్థులు ఏర్పాటు చేసిన నమూనాలను పరిశీలించారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం లక్ష్మీనారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు షఫి, మహమ్మద్, కో-ఆర్డినేటర్లు మధు, పవన్, చంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అరటితోట దగ్ధం

నార్పల: అరటితోట మంటల్లో దగ్ధమైన ఘటన శనివారం గడ్డంనాగేపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన రైతులు చిన్న నారాయణ, ఆనంద్ ప్రసాద్ ఆరు నెలల క్రితం దాదాపు ఆరు ఎకరాల్లో అరటి పంట సాగు చేశారు. పంట చేతికొచ్చింది. మరి కొన్ని రోజుల్లో పంటకోత కోయాల్సి ఉంది. అయితే శనివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో అరటిచెట్లతోపాటు డ్రిప్ పరికారలు కాలిబూడిదయ్యాయి. ఘటనలో రూ.12 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు.

ఇసుక తవ్వకాల అడ్డగింత

పామిడి: స్థానిక కొండూరురోడ్డులో అంకాలమ్మ, కుంటిమ్మ ఆలయం సమీపాన శనివారం జేపీ పవర్ వెంచర్ ఇసుక రీచ్‌ను స్థానికులు అడ్డుకున్నారు. ఇసుక తవ్వకంతో భూగర్భజలాలు అడుగంటి వేసవి రాకనే తాగునీటి ఎద్దడితో పాటు నదీ పరివాహక ప్రాంత పొలాలకు సాగునీరు సైతం అందని పరిస్థితి నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక

గుంతకల్లు రూరల్: రాష్ట్రస్థాయి అండర్ -9 చెస్ చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలకు పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు అనంతపురం చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్ తెలిపారు. అనంతపురం చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పెంగ్విన్ యాక్టివిటీ క్లబ్ వేదికగా జిల్లా అండర్-9 ఓపెన్, బాలికల చెస్ చాంపియన్ షిప్ పోటీలను నిర్వహించారు.మొత్తం 48 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో సుకృత ప్రథమ,జాహ్నవి ద్వితీయ, హారిక తృతీయ స్థానంలో నిలిచారు. ఓపెన్ విభాగంలో సాకేత్ ప్రథమ, సాయి యశస్ ద్వితీయ, కౌశిక్ రెడ్డి తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. వీరు అండర్ -9 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని శివకుమార్ తెలిపారు. ఈసందర్భంగా విజేతలను ఆయన అభినందించారు.

చిన్నారి కంటి చికిత్సకు ఆర్థికసాయం



పసికందుతో తల్లిదండ్రులు పక్రుద్దీన్, బషీరున్

తాడిపత్రి టౌన్ : పసికందు(20 రోజులు) కంటి చికిత్సకు వైఎస్సార్‌సీపీ నేత ఫయాజ్‌బాషా ఆర్థికసాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. వైఎస్సార్ జిల్లా జమ్మల మడుగుకు చెందిన పక్రుద్దీన్, బషీరున్ భార్యభర్తలు. రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబం. పక్రుద్దీన్ కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. వీరికి 20 రోజుల క్రితం బాబు పుట్టాడు. అయితే పుట్టుకతోనే రెటీనా సమస్య రావడంతో చికిత్స కోసం కడప పుష్పగిరి ఆస్పత్రికి వెళ్లారు. ఖరీదైన ఇంజెక్షన్ వేస్తే సమస్య ఉండదని కంటి వైద్యులు తెలియజేశారు. అనంతరం ఆస్పత్రిలోని కంటి వైద్యుడు సునీల్‌కుమార్ సమస్యను ఫయాజ్‌బాషాకు ఫోన్‌లో వివరించారు. వెంటనే స్పందించిన ఫయాజ్‌బాషా ఫయాజ్‌బాషా సేవా ట్రస్ట్ ద్వారా రూ.20 వేలు ఆర్థికసాయం చేశారు. ఇంజెక్షన్ వేయించడంతో చిన్నారి తల్లిదండ్రులు ఫయాజ్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపారు.

అశ్వత్థం ఆదాయం రూ.88.11 లక్షలు

పెద్దపప్పూరు: మాఘమాసం తిరునాల సందర్భంగా నెల రోజుల్లో అశ్వత్థం క్షేత్రానికి రూ.88.11లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. టెంకాయల విక్రయం ద్వారా రూ.10.58 లక్షలు, తలనీలాలు రూ.22.95 లక్షలు, కొబ్బరి చిప్పల సేకరణ రూ.90 వేలు, తాత్కాలిక హుండీల ద్వారా రూ.25,05,703, పర్మినెంటు హుండీల ద్వారా రూ.16,75,148 , శీఘ్రదర్శనం టిక్కెట్ల ద్వారా రూ.6,14,950, తల నీలాల టికెట్ల విక్రయం ద్వారా రూ.1,02,180 ఆదాయం వచ్చినట్లు వివరించారు. మూడేళ్లలో ఇంతటి మొత్తం ఆదాయం రావడం ఇదే ప్రథమమని వారు పేర్కొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో డీఈఓ సాయిరాం

బుక్కరాయసముద్రం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా విద్యా అధికారి సాయిరాం పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌ను డీఈఓ సాయిరాం తనిఖీ చేశారు. పాఠశాలలో ఎంత మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఉపాధ్యాయులు గుణాత్మక విద్యను అందించాలన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణ పట్టుదలతో చదివితే మంచి ఉన్నత స్థానాల్లో స్థిరపడొచ్చన్నారు. అనంతరం ఇటీవల స్కూల్ గేమ్స్ నెట్‌బాల్, బాస్కెట్ బాల్ సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. పాఠశాల పీడీ గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

గార్లదిన్నె: స్థానిక మోడల్ స్కూల్లో ఆదివారం నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభమవుతున్నట్లు ప్రిన్సిపాల్ సతీష్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ సెకండియర్‌కు చెందిన 45 మంది విద్యార్థులకు ఆదివారం నుంచి మార్చి 1వరకు నాలుగు రోజులు ప్రాక్టికల్స్ నిర్వహిస్తామన్నారు. ప్రతి ప్రయోగశాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

తాడిపత్రి టౌన్: స్థానిక మెయిన్ బజార్‌లోని ఆర్‌పీస్వామి కల్యాణ మండపంలో శనివారం 145 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 95 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు వాసవీ క్లబ్ అధ్యక్షుడు చంద్ర శేఖర్ తెలిపారు. వాసవీక్లబ్, బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శిబిరం జరిగింది. వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్స్ భూమా సూర్యనారాయణ, శేషాఫణి, టీటీసీ చైర్మన్ బండారు శివకుమార్, సభ్యులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్‌ను ప్రేరేపిస్తే ఊరుకోం

యల్లనూరు: గ్రామాల్లో ఫ్యాక్షన్‌ను ప్రేరేపిస్తే ఊరుకోమని ఎస్‌ఐ రామకృష్ణ హెచ్చరించారు. శనివారం మేడికుర్తి గ్రామంలో పర్యటించి సమస్యలపై గ్రామస్తులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎవరైనా శాంతిభద్రలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తుంటే సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.